క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రమేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పలు మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇన్ముల్‌నర్వ, జేపీదర్గా, కోల్‌బాయ్‌తండా, ధర్మాతండా, ఇన్ముల్‌నర్వ తండాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతరాయానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

వేసవిలో నీటి సమస్య రావొద్దు

మిషన్ భగీరథ డీఈ హారిక



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మిషనభగీరథ డీఈ హారిక సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులతో నీటి సమస్యపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో పెట్టుకొని బోరు బావుల్లో ఉన్న మోటార్లను మరమ్మతులు చేసుకోవాలన్నారు. అక్కడక్కడ ఉన్న చేతి పంపులను సైతం బాగు చేయించాలని సూచించారు. నీటి సమస్య రాకుండా అధికారులే బాధ్యత వహించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ సంధ్య మాట్లాడుతూ.. అధికారులు ప్రజలతో కలిసి గ్రామాల్లో ఉన్న సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తే సమస్యలు తలెత్తవని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కిషన్‌రావు, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ ఇమ్రాన్, గిడ్ ఏఈ ప్రియదర్శిని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ మొయిజుద్దీన్‌కు సన్మానం



మొయినాబాద్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పదోన్నతిపై మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా వచ్చిన ఆయన మండల కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ అధికారులు ఆయనను సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, వీధిదీపాలపై సమీక్షించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వెంకటేష్, సుదర్శన్, సిబ్బంది ఉన్నారు.

నిధుల ఖర్చుపై ఆడిట్



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిటింగ్ అధికారి

మొయినాబాద్‌రూరల్: ఏటా గ్రామాభివృద్ధికి సంబంధించి వెచ్చించిన నిధుల లెక్క పక్కాగా ఉండాలని జిల్లా సీనియర్ ఆడిటింగ్ అధికారి ఫేరోజ్ అన్నారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ పాలనలో ఖర్చు చేసిన నిధులు, వాటి బిల్లులను ఆడిటింగ్ చేస్తున్నట్లు సూచించారు. ఎలాంటి అవకతవకలు జరిగినా ఉన్నతాధికారుల దృష్టికి తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కారోబార్ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి

తుక్కుగూడ: ప్రజాయుద్ధ నౌక, ఉద్యమకారుడు గద్దర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో గద్దర్ జయంతి వేడుకల సందర్భంగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడుతూ.. గద్దర్ జయంతిని సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, జానకిరామ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్



మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్, మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్

మొయినాబాద్: 'స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పారిశుద్ధ్యం, మంచినీరు, వీధిదీపాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెడతాం. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైనవారికి అందిస్తాం. మున్సిపాలిటీల్లో ఉండే 42 మాడ్యూళ్లకు అనుగుణంగా పనిచేసి మొయినాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సంపూర్ణ కృషి చేస్తాం' అని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. కొత్తగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీకి తొలి కమిషనర్ బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. మిగిలిన వివరాలు ఆయన మాటల్లోనే..

సాక్షి INTERVIEW

అధ్యయనంతో ప్రత్యేక దృష్టి

మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో పర్యటించి స్థానిక పరిస్థితులను అధ్యయనం చేస్తాం. ఎక్కడెక్కడ ఏయే సమస్యలు ఉన్నాయో పరిశీలించి, నోట్ చేసుకుంటాం. వీటి పరిష్కారానికి తగిన ప్రణాళిక రూపొందిస్తాం. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారిస్తాం. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. తాగునీటి సరఫరా ఎలా ఉందో పరిశీలించి మరింత మెరుగు పరుస్తాం. మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో రోడ్లు, వీధిదీపాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తాం. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

అర్హులకు పథకాలు అందించేలా..

ముఖ్యమంత్రి, కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తిస్తాం. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలించాం. వీటి ఆధారంగా అర్హులను గుర్తించి లబ్ధిదారులకు అందేలా చూస్తాం. ప్రజాప్రతినిధులు లేని లోటు ఎక్కడా కనిపించకుండా సాధ్యమైనంత వరకు కష్టపడి పనిచేస్తాం. అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూస్తా. ప్రజల సహకారంతో మొయినాబాద్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తా.



షాబాద్: దయాకర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ సాధనకు పోరు

షాబాద్: సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసే దాకా తమ పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్‌రావు మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రారంలో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు మాదిగలను చైతన్యం చేసే కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఈ నెల 7న 'వేయి గొంతులు–లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రామకృష్ణ, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం రుద్రారం గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎనుకున్నారు. అధ్యక్షుడిగా చెవిటి దయాకర్ ఎంపికయ్యారు.

లక్ష డప్పుల ప్రదర్శనకు తరలిరండి

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్ మాదిగ అన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్ గ్రామంలో శుక్రవారం మాదిగ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 7న జరిగే వేల గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రేగడిఘనాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఈదుపల్లి రాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ స్థానాలపై అభ్యంతరాలు



చేవెళ్ల: ఎంపీడీఓ హిమబిందుకు వినతిపత్రం అందజేస్తున్న ఆలూరు గ్రామస్తులు

చేవెళ్ల: చేవెళ్ల నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో ఎంపీటీసీల స్థానాల తగ్గింపునకు సంబంధించి అధికారులు విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై రెండు అభ్యంతరాలు వచ్చాయి. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ హిమబిందుకు ఆలూరు, ఎన్కేపల్లి గ్రామస్తులు వేరువేరుగా వచ్చి తమ ఎంపీటీసీ పరిధిలో వేరే గ్రామాలను కలపొద్దని ఫిర్యాదు చేశారు. ఇందులో ఆలూరులో ప్రస్తుతం ఉన్న రెండు ఎంపీటీసీ స్థానాల్లో ఆలూరు–2 పరిధిలోకి న్యాలట, సింగప్పగూడ గ్రామాలను కలుపుతున్నట్లుగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని దీనిపై గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. అదే విధంగా ఎన్కేపల్లి పరిధిలోని కొత్తగా గొల్లపల్లి గ్రామాన్ని కలుపటాన్ని ఆ గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ ఫిర్యాదు పత్రాలను ఎంపీడీఓ హిమబిందు ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు.

కుత్బుద్దీన్‌గూడకు హోదా ఇవ్వాలి

మొయినాబాద్: కుత్బుద్దీన్‌గూడ, ఎలుకగూడ గ్రామాలను కలిపి ప్రత్యేకంగా ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయాలని కుత్బుద్దీన్‌గూడ గ్రామస్తులు ఎంపీడీఓ సంధ్యకు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామస్తులు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు మేడిపల్లి ఎంపీటీసీ స్థానంలో ఉన్న కుత్బుద్దీన్‌గూడలో జనాభా, ఓటర్లు పెరిగారని.. దానికి తోడు ఎలుకగూడ గ్రామ పంచాయతీని కలిపి ప్రత్యేకంగా కుత్బుద్దీన్‌గూడ ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేయాలన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో మాజీ సర్పంచ్ పాషా, మాజీ ఉపసర్పంచ్ మినాజుద్దీన్, నాయకులు ఈశ్వర్, పాషా, గ్రామస్తులు ఉన్నారు.



మొయినాబాద్: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కుత్బుద్దీన్‌గూడ గ్రామస్తులు

మున్సిపాలిటీలో కలపాలని వినతి

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అప్పోజుగూడ గ్రామాన్ని మున్సిపాలిటీలో కలపాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు మండల అభివృద్ధి అధికారికి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామం చిలుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్నందున మున్సిపాలిటీని చేయాలని గ్రామస్తులందరు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఉపసర్పంచ్ సురేష్, నాయకులు మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

పనులు పూర్తయినా.. ప్రారంభించరా?

- అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం
- ఇబ్బందులు పడుతున్న పాఠకులు

కొత్తూరు: గ్రంథాలయాలే ఆధునిక దేవాలయాలని విశ్వసించే పుస్తకప్రియులకు భంగపాటు తప్పడం లేదు. చదువుకునేందుకు సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొత్తూరు పట్టణంలో అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయ నిర్మాణ పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం పనులు 90 శాతం మేర పూర్తయ్యాయి. కాగా కాంట్రాక్టర్, అధికారులకు మధ్య సమన్వయ లోపంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. మొదట్లో మంజూరైన రూ.75 లక్షలతో భవనంలో అన్ని పనులు పూర్తి చేయడం కష్టమని, అదనంగా రూ.10 లక్షలు అవసరమని కాంట్రాక్టర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. దీనికి యంత్రాంగం ఆమోదం తెలుపగా.. కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేశాడు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో చివరి దశలో పనులు నిలిపి వేయడమే కాకుండా భవనానికి తాళం వేసి నిరసన తెలుపుతున్నాడు. దీంతో గ్రంథాలయాన్ని ప్రస్తుతం అద్దె భవనంలో అసౌకర్యాల మధ్యన నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

తగ్గిన పాఠకుల సంఖ్య

పట్టణంలో ప్రస్తుతం అద్దె షెటర్‌లో గ్రంథాలయం అసౌకర్యాల మధ్యన కొనసాగుతుంది. ఇరుకు ఉండడంతో పాఠకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.



షెటర్‌లో కొనసాగుతున్న గ్రంథాలయం

గతంలో గ్రంథాలయానికి 150 మంది వరకు పాఠకులు వస్తుండగా.. స్థలాభావం కారణంగా ప్రస్తుతం కేవలం 25 మంది పాఠకులు మాత్రమే వస్తున్నారు. గ్రంథాలయంలో నిత్యం 14 దినపత్రికలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా ఆయా పోటీ పరీక్షలకు సంబంధించిన 700 పుస్తకాలు, ఇతర మ్యాగజైన్ల కోసం పాఠకులు వస్తుంటారు.



ప్రారంభానికి నోచుకోని కొత్త భవనం

త్వరలో ప్రారంభిస్తాం



గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్‌కు రావాల్సిన అదనపు నిధులు మంజూరు చేయించడానికి చర్చించాం. మిగిలిన పనులు పూర్తి చేసి ఈ నెలలో ప్రారంభించడానికి కృషి చేస్తున్నా. ఇప్పటికే కాంట్రాక్టర్‌తో చర్చించి నిధులు సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చాం. కొత్త భవనంలో అన్ని పనులు పూర్తి చేసే విధంగా ఆదేశించాం.

– మధుసూదన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్

అధ్యక్ష ఎంపికపై నేతల అసంతృప్తి



రాజీనామా పత్రాలు చూపుతున్న బీజేపీ క్రియాశీల సభ్యులు

కేశంపేట: ప్రజాభిప్రాయ సేకరణలో అర్హత సాధించలేని వారికి బీజేపీ మండల అధ్యక్ష పదవి కట్టబెట్టారని పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేశ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఎస్‌వై గార్డెన్‌లో ఆయన శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. బీజేపీ మండల అధ్యక్ష పదవికి నిర్వహించిన అభిప్రాయ సేకరణలో 80 శాతం మంది తనకే అనుకూలంగా వచ్చిందన్నారు. ఇందులో ఐదుగురు పదవి కోసం పోటీ పడ్డారన్నారు. కానీ అభిప్రాయ సేకరణకు విరుద్ధంగా పార్టీ మండల అధ్యక్షురాలిగా రాధికను ఎంపిక చేయడం అన్యాయమన్నారు. తనతో పాటు పార్టీలో ఉన్న 250 మంది రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, క్రియాశీల సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకం

శంకర్‌పల్లి: పంచాయతీ కార్యదర్శుల సంఘం శంకర్‌పల్లి మండల అధ్యక్షుడిగా సి.ఎల్లయ్యని పంచాయతీ కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా.. కార్యదర్శులు అంతా కలిసి మండల అధ్యక్షుడిగా సి.ఎల్లయ్యని, ఉపాధ్యక్షుడిగా సుదర్శన్, కార్యదర్శిగా శరణ్, కోశాధికారిగా ప్రమీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ నియామకపత్రాన్ని ఎల్లయ్యకి అందించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. మండలంలో పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ, రియాజ్, రమ్య, దివ్య, పుష్పలత, తిమ్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, నవీన్, హామీద్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న ఎల్లయ్య


5 నుంచి మీరాపూర్ దర్గా ఉత్సవాలు



మీరాపూర్ దర్గా

షాబాద్: మండల పరిధిలోని మీరాపూర్ దర్గా ఉత్సవాలను ఈ నెల 5 నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెన్నాబాయ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మీరాపూర్ గ్రామంలో ఉన్న దర్గాలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరిలో ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో ప్రాచుర్యం పొందిన మీరాపూర్ దర్గాలో ఖవాలి, గంధం, నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు జిల్లాలోని నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటుంటారన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు సత్కారం



మున్సిపల్ మాజీ చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న కేటీఆర్

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్‌లను శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్‌లు మాజీ చైర్మన్ నరేందర్‌మహేశ్వరీ దంపతులు, మాజీ వైస్ చైర్మన్ నటరాజ్‌లకు శాలువాలు కప్పి సత్కరించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల అరెస్టు

షాద్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఉదయాన్నే నేత ఇళ్లకు వెళ్లి అదుపులోని తీసుకొని షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్దను మండలంగా ప్రకటించాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్న నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. పలువురు నాయకులు మాట్లాడుతూ... పోలీసులు అక్రమంగా తమను అరెస్టు చేయడం సరికాదని అన్నారు. ఘన చరిత్ర కలిగిన మొగిలిగిద్ద గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. అరెస్టయిన వారిలో నాయకులు రాజు, బాలాజీ, కృష్ణ, రాము, శ్రీను, నరేష్‌గౌడ్, రాధాకృష్ణ, రవి, తదితరులు ఉన్నారు.



షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వండి

శంకర్‌పల్లి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక నుంచి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలని శుక్రవారం శంకర్‌పల్లి పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ వెంకయ్యకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ప్రత్యేక సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య, కార్యదర్శులు సుదర్శన్, ప్రమీల, రమ్య, దివ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దాతల సహకారం మరువలేనిది

చేవెళ్ల: మండల విద్యావనరుల కేంద్రం అభివృద్ధికి దాతలు అందించిన సహకారం మరువలేనిదని ఎంఈఓ పురందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావనరుల భవనానికి సహకరించిన దాతలు చేవెళ్ల మాజీ సర్పంచ్ బి.శైలజఆగిరెడ్డి, దేవర సమతావెంకట్‌రెడ్డి, చేవెళ్లకు చెందిన కవాడి తిరుపతిరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయులు హన్మంత్‌రెడ్డిలను సమావేశంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మతులు చేసి నూతనంగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం ఖాజాపాష, నాయకులు ఆగిరెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కేశంపేట: బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎల్‌హెచ్‌పీఎస్ (లంబాడి హక్కుల పోరాట సమితి) మండల అధ్యక్షుడు జర్పుల రాజునాయక్ ఓ ప్రకటనలో కోరారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ ఆదేశాల మేరకు సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలనే డిమాండ్‌తో శనివారం షాద్‌నగర్‌లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో లంబాడీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.